## క్లుప్తంగా

### ఆధార్ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక శిబిరాలు



ఆధార్‌ను అప్‌డేట్ చేసుకుంటున్న కార్డుదారులు

**బుచ్చినాయుడుకండ్రిగ:** ఆధార్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హత ఉండి ఆధార్ సమస్యలతో పలువురు ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నారని, దీనిని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేకంగా సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. 41 మంది వివరాలను అప్‌డేట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

### శ్మశానం రోడ్డుకు మరమ్మతులు



శ్మశానం రోడ్డుకు వేసిన గ్రావెల్

**ఏర్పేడు:** మండలంలోని పాగాలి శ్మశానానికి వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో గురువారం దానికి గ్రావెల్ వేసి బాగు చేశారు. శ్మశానానికి సుమారు 350 మీటర్లు దూరం మట్టి రోడ్డు ఉంది. రోడ్డు దెబ్బతినడంతో వర్షాకాలం మృతదేహాలను శ్మశానానికి తీసుకుని వెళ్లడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. ఇటీవల గ్రామస్తులు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేశారు.

### చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

**ఏర్పేడు:** మండలంలోని పల్లంపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ప్రారంభించారు. రోజురోజుకూ ఉష్ణోగ్రత పెరిగి ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి పల్లంపేటకు వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకీ, కుమార్‌రెడ్డి, సుబ్బయ్య నాయుడు, ధనుంజయరెడ్డి, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### సీజ్ చేసిన మద్యం ధ్వంసం



**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి పట్టణంలోని సెబ్ కార్యాలయం వద్ద అధికారులు వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశారు. శ్రీకాళహస్తి సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 73మద్యం సీసాలు, 53 సారా ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో సెబ్ తిరుపతి ఏఈఎస్ శ్రీనివాసరావు, సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలను పెంపుతో ఉజ్వల భవిత



మహిళా వర్సిటీ విద్యార్థినులు, అధ్యాపకులతో కెనడా ప్రొఫెసర్లు

**తిరుపతి ఎడ్యుకేషన్:** ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థినులు చదువుతో పాటు యాజమాన్య నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని తెలిపారు. వర్సిటీలో 20 రోజులుగా బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థినులకు కెనడాకు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లుచే నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ప్రసంగించారు. శిక్షణ ద్వారా బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థినులు భవిష్యత్తులో కంపెనీల స్థాపనకు అనుగుణమైన పరిస్థితులు, అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలో తెలుసుకున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి కెనడా ప్రొఫెసర్లు బ్రెండా స్టోక్స్, సబ్రినా రాయ్ అన్ని అంశాలతో విద్యార్థినులకు అవగాహన కల్పించారని తెలిపారు. అనంతరం కెనెడా ప్రొఫెసర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ కె.అనురాధ, ఇంటర్నేషనల్ డీన్ విజయలక్ష్మి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి బి.విజయలక్ష్మి, ఎన్. శ్రీరజిని, పి.రూప, యువశ్రీ పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు తీర్చరూ!

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేకు వినతి
- సచివాలయ నిధులతో దాహార్తి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశం



నాగలాపురం ఆది ఆంధ్రవాడలో బుక్‌లెట్ ఇచ్చి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**పిచ్చాటూరు:** తమ గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని నాగలాపురం మండలం వడ్లకుప్పం, ఆదిఆంధ్రవాడ గ్రామాల ప్రజలు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామ ప్రాథమిక పాఠశాలలో కూడా తమ పిల్లలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని నివేదించారు. గురువారం నాగలాపురం సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఆది ఆంధ్రవాడ, వడ్లకుప్పం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఆయా కుటుంబాలకు సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో ఆయన వివరించారు. సమస్యలపై ఆరా తీసినప్పుడు గ్రామస్తులు పైవిధంగా ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షల నిధులతో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ జనరంజక పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు దిక్కుతోచని స్థితిలో పనిగట్టుకుని బురద చల్లుతున్నాయని విమర్శించారు. అయినా ప్రజలు ఎవరూ నమ్మే స్థితిలో లేరని చెప్పారు. అతర్వాత వడ్లకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేసి ఆశీర్వదించారు. బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, ఎంపీడీఓ పద్మజ, తహసీల్దారు ప్రసన్నకుమార్, సర్పంచులు పయణి, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి జేబీఆర్ మునిరత్నం, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, ఏఎంసీ డైరెక్టర్లు కులశేఖర్ రెడ్డి, అలగేశన్, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎస్‌ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, డానియేల్, మురళి, దేశప్పన్, చిన్నమణి, జేమ్స్, కుబేర్, మునివేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ భవనం ప్రారంభం



బీఎన్‌కండ్రిగ : తలారివెట్టులో స్థలదాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని తలారివెట్టులో ఉపాధి హామీ నిధులు రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల అధికారులు, గ్రామ వలంటీర్లు సమష్టిగా పనిచేస్తేనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చన్నారు. సచివాలయాల్లో సమస్యలను 72 గంటల్లో పరిష్కరిస్తారన్నారు. అర్హులందరికీ పథకాలు దరి చేరుస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ వారధిగా పనిచేయాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అరణి విద్యానాథరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి, ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు సుందర్‌రెడ్డి, హరిగోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, ఇమామ్‌బాషా, మునస్వామి, భాస్కరయ్య, తిరుపాల్, ప్రసాద్, సర్పంచులు రాఘవమ్మ, పాలవేణి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, డీటీ తహసీల్దారు శివయ్య,ఎస్‌ఐ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

**స్థలదాతకు ఘన సన్మానం**

గ్రామసచివాయల భవన నిర్మాణం కోసం స్థలా న్ని ఇచ్చిన విరాళదాత పత్తిసుబ్బరామయ్యశెట్టి, మునెమ్మ వారి జ్ఞాపకార్థం పత్తిరామనాథంశెట్టి, పత్తి రామకృష్ణయ్య శెట్టి విలువైన స్థలాన్ని విరాళంగా అందజేశారు. వీరిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన ముఖ్యం



ప్రమాదంలో తప్పించుకునే పద్ధతులను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**సత్యవేడు:** అగ్ని ప్రమాదాలు నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి పి.రాజయ్య అన్నారు. గురువారం స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో ముగింపు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. మాక్ డ్రిల్ చేశారు. అగ్ని మాపక సిబ్బంది వినియోగించే పరికరాలను ప్రదర్శనకు ఉంచి నరసరాజు అగ్రహారం గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నీటి ప్రమాదంలో చిక్కుకున్న సమయంలో ప్రమాదం నుంచి బయటపడే మెలకువలు నేర్పారు. వరదల్లో చిక్కున్న పిల్లలు ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు ప్లానింగ్ తదితర విషయాలను యానిమేషన్ చిత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజి, వార్డు సభ్యులు, లీడింగ్ ఫైర్‌మెన్ మేలు, గోవిందరాజులు, సుబ్రమణ్యం, ఫైర్‌మెన్లు కే.కాళచంద్రన్, రమణమూర్తి, జీ. నరేష్, దామోదరం పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



హౌసింగ్ పురోగతిపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ హరిబాబు

**రేణిగుంట:** మండలంలో జగనన్న కాలనీల హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ హరిబాబు ఆదేశించారు. హౌసింగ్‌పై గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి.. వివిధ దశలలో ఉన్న ఇళ్ల వివరాలు, ప్రారంభం కాని ఇళ్ల వివరాలను తెలుసుకుని హౌసింగ్ సిబ్బంది అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్మాణాల పురోగతికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లిం మహిళలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**శ్రీకాళహస్తి:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం ముస్లిం మహిళలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మాసారపు వెంకట సుబ్బయ్య నగర్‌లో ఈ విందు ఇచ్చారు. పట్టణంతోపాటు సమీప గ్రామీణ ప్రాంతాల ముస్లింలు, ముస్లిం మహిళలు హాజరయ్యారు. ఎమ్మెల్యే ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోరమైన ఉపవాస దీక్షలు చేస్తారని తెలిపారు. అల్లా చూపిన మార్గంలో నడవాలని, ఇతరుల పట్ల సోదర భావాన్ని కలిగి, దానధర్మాలు చేయాలన్నారు. బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ, అల్లా అనుగ్రహం ముస్లింలపై ఎల్లవేళలా ఉండాలని, కుటుంబ సభ్యులు సుఖశాంతులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పార్టీనేతలు పాల్గొన్నారు.

**ఎండీ పుత్తూరులో...**

**ఏర్పేడు:** పవిత్ర రంజాన్ సందర్భంగా మండలంలోని ఎండీ పుత్తూరులో గురువారం గ్రామంలోని ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మగ్రిబ్ ప్రార్థన అనంతరం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక సర్పంచ్ మోహనప్రియ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**మహిళలకు చీరల పంపిణీ**

**తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) :** రంజాన్ పురస్కరించుకుని మండలంలోని రామచంద్రపురంలో గురువారం మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలతోపాటు బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ షేక్ మహబూబ్ బాషా, షరీఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో సర్పంచ్ మోహనప్రియ



తొట్టంబేడు : చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

### ఉపాధి పనులపై డ్వామా పీడీ, ఎమ్మెల్యే సమీక్ష

**పిచ్చాటూరు:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై ఎమ్మెల్యే కోనేటి ఆదిమూల, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ గురువారం మధ్యాహ్నం నాగలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. పలువురు ప్రజాప్రతి నిధులు తమ పంచాయతీలలో క్షేత్ర సహాయకుల తీరుపై పీడీ, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఉపాధి సిబ్బందిపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా విచారణ చేసి తప్పులు చేసి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, తప్పు చేసే ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదన్నారు.

**ఉపాధి కూలీల ఆందోళన**

తమ పంచాయతీలో సస్పెండ్ అయిన క్షేత్ర సహాయకుడు మునివేలును మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఉపాధి కూలీలు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడంతో ఆందోళనకారులు శాంతించారు. సమీక్షలో పుత్తూరు క్లస్టర్ ఏపీడీ సరిత, ఎంపీడీఓ పద్మజ, ఏపీఓ సుకన్య, జేఈ సురేష్, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

### పోటీ పరీక్షలతో నైపుణ్యం పెంపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

**తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్):** పోటీ పరీక్షలతో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని శ్రీకాళహస్తి డీఎస్పీ డీ.విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మరాజులస్వామి గుడి సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్–3 విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారు. గురువారం వారికి నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఎస్పీ మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రమణ , తిరుపతి జోన్ అకడమిక్ కో–ఆర్డినేటర్ బాలాజి, డీన్ కేదార్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు తిరువట్యంలో గడప గడపకు..

**నారాయణవనం:** మండలంలోని తిరువట్యం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు, ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు.

**మార్కెట్ పాలకమండలి ప్రమాణ స్వీకారం**

**బుచ్చినాయుడుకండ్రిగ:** స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి గంగయ్య తెలిపారు. చైర్‌పర్సన్‌గా ఉగ్గుమూడి సంధ్యతో పాటు 16 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని, ముఖ్య అతిథులుగా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు అవుతారని చెప్పారు.

# 'ఉపాధి' సరే!..వసతులేవీ?



రామలింగాపురం చెరువులో పనులు చేస్తూ ఎండకు తట్టుకోలేక చెట్టుకింద సేద తీరిన కూలీలు

నిరుపేద కూలీల జీవనోపాధికి ఉపాధి హామీ పథకం పనులు ఆసరాగా నిలుస్తున్నాయి. అయితే పనులు చేస్తున్న ప్రదేశాల్లో సేద దీరడానికి ఎలాంటి వసతులు కల్పించకపోవడం, ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో లేకపోవడంతో ఎండ తీవ్రతకు సొమ్మసిల్లిపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

- మండుటెండలోనే పనులు
- రోజూ పనుల్లో సుమారు ఎనిమిది వేల మంది కూలీలు
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇబ్బందులు పడుతున్న కష్టజీవులు
- కనిపించని టెంట్లు..ప్రథమ చికిత్స పెట్టెలు



పనులు చేస్తున్న కూలీలు

**శ్రీకాళహస్తి రూరల్:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో 132 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల పరిధిలో సుమారు 52 వేల కుటుంబాలకు జాబ్‌కార్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే 28 వేల మంది కూలీలు మాత్రమే ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీలు రోజుకు సగటున సుమారు ఎనిమిది వేల మంది పనులకు హాజరవుతున్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ సంఖ్యను పెంచాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. ఇంత వరకు బాగున్నా.. పనిచేసే ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు కనిపించటం లేదు. కనీసం తాగునీరు వసతి కూడా కల్పించడం లేదని కూలీలు మండిపడుతున్నారు. ఎండ వేడిమి ఎక్కువైతే పనులు చేసే పరిసర ప్రాంతాల్లో ఉన్న పొదలు, చెట్ల కింద సేద దీరుతున్నారు. నాలుగేళ్ల కిందట ప్రభుత్వం ఉపాధి పనులు చేసే కూలీలకు నీడ కల్పించేందుకు టార్పాలిన్ పట్టలు, వైద్య వసతికి కిట్లు అందజేసింది. అయితే స్థానికంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు వాటిని ఏంచేశారనేది పైవాడికే తెలియాలి. పనులు చేసే ప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేయలేదని కూలీలు బాహాటంగానే చెబుతున్నారు. ఇకనైనా కూలీలు పనిచేసే ప్రాంతాల్లో తాగునీరు, నీడ వసతి కల్పించడంతోపాటు ఫస్ట్ ఎయిడ్ బాక్సులను ఏర్పాటు చేయాల్సి ఉంది.

**వసతుల లేమి వాస్తవమే**

ఉపాధి కూలీలు పనిచేసే చోట పూర్తి స్థాయిలో వసతులు లేకపోవడం వాస్తవమే.ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు మంజూరు చేసినప్పుడు అందిస్తాం.

**- కృష్ణయ్య , ఉపాధి హామీ ఏపీఓ, శ్రీకాళహస్తి**

## ఘనంగా వార్షికోత్సవం



వార్షికోత్సవంలో గోవిందరెడ్డి, టీచర్లు, విద్యార్థులు

**శ్రీకాళహస్తి రూరల్:** నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ ప్రాప్తించిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ పల్లమాల గోవిందరెడ్డి అన్నారు. మండంలోని బొక్కసంపాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం స్థానిక సర్పంచ్ కప్పారేఖ అధ్యక్షతన వార్షికోత్స వం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోవిందరెడ్డి మాట్లాడారు. విద్యారంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, విద్యార్థుల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ కప్పా సుబ్రమణ్యం, సీఆర్‌పీ స్వప్న, ఉపాధ్యాయులు యశోద, ప్రియాంక, తేజోవతి, ప్రియాంక, ఉమాదేవి, గంగోజమ్మ పాల్గొన్నారు.

## ఇంటింటికీ 'జగనన్నే మా భవిష్యత్తు'



తొట్టంబేడు మండలంలో..



శ్రీకాళహస్తి రూరల్‌లో..

**తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్):** మండలంలోని చోడవరం, చియ్యావరం, చేమూరులో గురువారం జేసీఎస్ మండల ఇన్‌చార్జి భక్తవత్సలం, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు చవిచూసిన నష్టం, ప్రస్తుత ప్రభుత్వం చేసిన మేలును తెలియజేశారు. ఇళ్ల యజమానుల అనుమతితో ఇంటికి, సెల్ ఫోన్లకు జగనన్న స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో చోడవరం మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

**గుంటకిందపల్లెలో..**

**శ్రీకాళహస్తి రూరల్:** ప్రజల నుంచి వచ్చిన నినాదమే 'మా నమ్మకం నువ్వే జగన్' అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుంటకిందపల్లెలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ప్రతి ఇంటికీ వెళ్లి గత 46 నెలల్లో ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాభిప్రాయాలు సేకరించి, నమోదు చేస్తున్నామన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి తెలిపి, ఆయా ఇళ్లు, సెల్‌ఫోన్లకు జగనన్న స్టిక్కర్లు అంటించారు. మిస్డ్ కాల్ ఇప్పించారు. సచివాలయం కన్వీనర్లు గోపిగౌడ్, రాఘవరెడ్డి, మునికృష్ణయ్య, రామచంద్రారెడ్డి, వెంకటరమణయ్య, సుబ్బరామయ్య, భానుమూర్తియాదవ్, సుధాకర్‌రెడ్డి, మురగయ్య, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## వేగంగా గంగమ్మగుడి రోడ్డు పనులు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

**తిరుపతి తుడా:** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి గురువారం పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగర అభివృద్ధి, ప్రజా రవాణా మెరుగు, గంగమ్మ గుడి జాతర కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధి చెందితే తిరుపతి నడిబొడ్డున విశాలవంతమైన రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. మార్కింగ్ చేసినంతవరకు కచ్చితంగా తొలగించే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మరో 10 రోజుల తర్వాత గంగమ్మకు మహా కుంభాభిషేకం జరుగుతుందనే విషయాన్ని గుర్తు చేస్తూ అంతలోపు పనులన్నీ పూర్తి కావాలన్నారు. ఆయన వెంట స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాబు, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాపరెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, ఉదయ్ వంశీ, చింత భరణీయాదవ్, తులసీయాదవ్, రమేష్‌యాదవ్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈ దేవిక ఉన్నారు.